ప్రజాశక్తి

బుధవారం 15 మే 2024 5

శ్రీ సత్యసాయి





అనంతపురం స్ట్రాంగ్ రూమ్‌కు గదికి తాళం వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



ఓట్ల లెక్కలు తేలాయి..!

◆ స్వల్పంగా పెరిగిన ఓటింగ్
◆ ఓట్ల పరంగా భారీగా పెరుగుదల
◆ పెరిగిన ఓట్లు ఎటువైపన్న అంచనాల్లో పార్టీలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కలు తేలాయి. సోమవారం జరిగిన ఓటింగ్‌కు సంబంధించి ఎక్కడ ఎంత మేరకు పోలింగ్ జరిగిందన్న వివరాలు మంగళవారం నాటికి తేలాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటల వరకు పోలింగ్ జరిగింది. 2019తో పోలిస్తే స్వల్పంగా ఓటింగ్ పెరిగినట్లు కనిపించినా... ఓట్ల పరంగా చూసినప్పుడు భారీ వ్యత్యసమే కనిపిస్తోంది. ఎందుకంటే 2019 ఎన్నికల సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాగా ఉండేది. ఆ సమయంలో అనంతపురం, హిందూపురం పార్లమెంటు పరిధిలో కలిపి మొత్తం 32,39,498 ఓట్లు ఉండగా 26,54,257 ఓట్లు పోలయ్యాయి. అంటే మొత్తం ఓట్లలో 82.22 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి అంటే 2024 సార్వత్రిక ఎన్నికలకు వచ్చే సరికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు కలిపి మొత్తం 30,41,924 ఓట్లు ఉన్నాయి. ఇందులో 26,54,257 ఓట్లు పోలయ్యాయి. అంటే మొత్తంగా చూసినప్పుడు 82.91 శాతం ఓట్లు పోలయ్యాయి. ఓట్ల పరంగా చూస్తే 2019 కంటే ఈసారి 3,87,667 ఓట్లు అధికంగా పోలయ్యాయి. శాతంలో స్వల్పమే అనిపించినప్పటికీ ఓట్లలో చూసినప్పుడు భారీగా పెరుగుదల కనిపిస్తోంది.

2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఓట్ల శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
రాయదుర్గం	2,49,553	2,14,668	86.03
ఉరవకొండ	2,15,744	1,85,981	86.22
గుంతకల్లు	2,52,373	1,91,252	75.81
తాడిపత్రి	2,34,741	1,90,728	81.26
శింగనమల	2,35,044	1,98,481	84.44
అనంతపురం	2,55,682	1,62,548	63.58
కళ్యాణదుర్గం	2,19,591	1,90,492	86.75
మొత్తం	16,62,728	13,34,150	80.23
నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
రాప్తాడు	2,45,435	2,02,058	82.32
మడకశిర	2,01,825	1,78,357	88.36
హిందూపురం	2,29,262	1,77,903	77.59
పెనుకొండ	2,20,383	1,91,708	86.98
పుట్టపర్తి	1,99,675	1,70,450	85.37
ధర్మవరం	2,40,323	2,07,869	86.50
కదిరి	2,39,867	1,91,762	79.95
మొత్తం	15,76,770	13,20,107	81.93
మొత్తం	32,39,498	26,54,257	81.93

2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఓట్ల శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
రాయదుర్గం	2,64,352	2,27,248	85.964
ఉరవకొండ	2,24,339	1,92,441	85.781
గుంతకల్లు	2,70,648	2,03,820	5.308
తాడిపత్రి	2,48,880	2,06,703	83.053
శింగనమల	2,47,373	2,05,068	82.898
అనంతపురం	2,81,214	1,83,018	65.081
కళ్యాణదుర్గం	2,30,785	2,05,143	8.889
మొత్తం	1767591	1423441	80.530
నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
రాప్తాడు	2,50,571	2,13,207	85.09
మడకశిర	2,10,804	1,84,453	87.50
హిందూపురం	2,49,174	1,93,882	77.81
పెనుకొండ	2,35,986	2,05,213	86.96
పుట్టపర్తి	2,11,062	1,82,083	86.27
ధర్మవరం	2,45,758	2,18,282	88.82
కదిరి	2,53,420	2,06,207	81.37
మొత్తం	16,56,775	14,03,327	84.70
మొత్తం	34,24,366	28,26,768	82.54

గెలుపుపై ఎవరి అంచనాలు వారివి..!

ఓటింగ్ సరళి, పోలయిన లెక్కలను చూసుకుని ఆయా పార్టీలు ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగానూ ఎక్కడ ఎన్ని ఓట్లు వచ్చి ఉండవచ్చునని లెక్కలు వేసుకునే పనిలో అభ్యర్థులు పడ్డారు. పెరిగిన ఓట్ల సంఖ్య తమకు లాభిస్తుందంటే.. తమకు లాభిస్తుందని ధీమాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే లోలోన మాత్రం ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో గుబులు కనిపిస్తోంది. దీంతో రాజకీయ విశ్లేషకులతో సైతం తమ భవితవ్యం ఏ రకంగా ఉండనుందన్న అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

అనంతలో మూడు... హిందూపురంలో నాలుగు నియోజకవర్గాల్లో పెరుగుదల..

అనంతపురం పార్లమెంటు పరిధలో చూసినప్పుడు తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో అంతకముందు కంటే ఓటింగ్ శాతం పెరిగింది. తాడిపత్రిలో 2019 ఎన్నికల సమయంలో 81.26 శాతం ఓటింగ్ జరిగితే ఈసారి 83.05 శాతం జరిగింది. 1.79 శాతం పోలింగ్ పెరిగింది. అనంతపురంలో అంతకు మునుపు 63.58 శాతం పోలింగ్ జరిగితే ఈసారి 65.08 శాతం పోలింగ్ జరిగింది. 1.5 శాతం పెరిగింది. ఇక కళ్యాణదుర్గంలో అంతకు మునుపు 86.75 శాతం కాగా ఈసారి 88.89 శాతం పోలింగ్ జరిగింది. అంటే 2.14 శాతం పెరిగింది. హిందూపురం పార్లమెంట్ పరిధిలోకి వచ్చే సరికి రాప్తాడు, హిందూపురం, రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరం, కదిరిలో ఓటింగ్ శాతం పెరిగింది. పెరిగిన ఓట్లు ఎటువైపు మళ్లాయన్నది చూడాల్సి ఉంది.

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 84.82 శాతం పోలింగ్

పుట్టపర్తి అర్బన్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 84.82 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గంలో 2,50,571 మంది ఓటర్లు ఉండగా 2,13,010 ఓట్లు పోల్ కాగా 85.01 శాతం నమోదు అయ్యింది. మడకశిర 2,10,804 మంది ఓటర్లు ఉండగా 1,84,454 ఓట్లు పోల్ కాగా 87.50 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. హిందూపురంలో 2,49,174 మంది ఓటర్లు ఉండగా 1,93,882 ఓట్లు పోలయ్యాయి. 77.81 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పెనుకొండ 2,35,986 మంది ఓటర్లు ఉండగా 2,05,213 ఓట్లు పోలయ్యాయి. 86.96, శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పుట్టపర్తి 2,11,062 మంది ఓటర్లు ఉండగా 1,82,083 ఓట్లు పోల్‌కాగా 86.27 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ధర్మవరం 2,45,758 మంది ఓటర్లు ఉండగా 2,18,282 ఓట్లు పోల్ కాగా 88.82 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. కదిరి నియోజకవర్గంలో 2,53,420 మంది ఓటర్లు ఉండగా 2,06,208 ఓట్లు పోల్ కాగా 81.37 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. హిందూపురం పార్లమెంటు స్థానంలో 16,56,775 మంది ఓటర్లు ఉండగా 14,05,277 ఓట్లు పోల్ అయ్యాయి. 84.82 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. గత సాధారణ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ప్రధానంగా యువత, మహిళలు, ఉద్యోగులు, తటస్థ ఓటర్ల ఓటర్లు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు.

స్ట్రాంగ్‌రూముల్లో భవితవ్యం..!

జెఎన్‌టియుకు చేరిన అనంత జిల్లా పోల్డ్ ఈవీఎంలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూమ్‌లకు చేరింది. అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో సాధరణ ఎన్నికల దష్ట్యా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కోసం ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూముల్లో పోల్డ్ ఈవీఎంలను భద్రపరిచారు. సోమవారం రాత్రి ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయా నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు జెఎన్‌టియు స్ట్రాంగ్ రూమ్‌ల్లోకి చేరాయి. అధికారుల బందోబస్తు, పర్యవేక్షణ నడుమ వీటిని భద్రపరిచారు. బుధవారం వేకువజామున ఈవీఎంలకు సీలింగ్ వేసే కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి పాల్గొన్నారు. ఈయనతో పాటు గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు మనీష్ సింగ్, రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.అజయ్ నాథ్ ఝ జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తదితరులు ఉన్నారు. ఆయా పార్టీ అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచి గదులకు సీల్ వేశారు. పోలింగ్ రోజు వీటిని తెరవనున్నారు. ఈవీఎంల భద్రపరిచిన నేపథ్యంలో జెఎన్‌టియు చుట్టూ పోలీసు బందోబస్తును పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

లేపాక్షి, హిందూపురానికి సత్యసాయి జిల్లా ఈవీఎంలు

పుట్టపర్తి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎం బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్‌రూమ్‌ల్లో అధికారులు భద్రపరిచారు. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ జిల్లాలో పలుచోట్ల అర్ధరాత్రి వరకు జరిగింది. మంగళవారం ఉదయం పోల్డ్ ఈవీఎంలను లేపాక్షి మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్ రూముల్లో ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గం సంబంధించిన బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీటిని భద్రపరిచి గదికి సీల్ చేశారు. ఎన్నికల పరిశీలకులు రామచంద్ర తివారి, కలెక్టర్ అరుణ్ బాబు, ఆర్వోలు వెంకట శివసాయి రెడ్డి, భాగ్యరేఖ, పలువురు రాజకీయ ప్రతినిధుల సమక్షంలో వీటిని భద్రపరిచారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గం సంబంధించి హిందూపురం సమీపంలోని మలగూరు వద్ద గల బిట్స్ కళాశాలలో ఈవీఎం బ్యాలెట్ బాక్స్‌లను బద్రపరిచారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను అనంతపురం జెఎన్‌టియు కళాశాలకు తరలించారు.



లేపాక్షి చోళసముద్రం స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేస్తున్న అధికారులు

ప్రజాస్వామ్య పరిరక్షణకు నిదర్శనం : కందికుంట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి -కదిరి టౌన్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న జరిగిన పోలింగ్ సరలి చూస్తే ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓట్లు వేశారని ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇది స్ఫూర్తిగా నిలిచిందని కదిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలుగా వైసిపి పాలనలో ప్రజలు టీడీపీ శ్రేణులు అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. పోలింగ్ సందర్భంగా అనేక రకాల అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్న కూటమి నాయకులు, కార్యకర్తలు ధైర్యంతో ఎదుర్కొన్నారన్నారు. ఈ ఎన్నికలు కదిరి నియోజకవర్గానికి ప్రత్యేకమైన ఎన్నికలని అన్నారు. ఎన్నికలను నిర్వహించడంలో ప్రజాస్వామ్యంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన బాధ్యత : పరిటాల

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

ఈ ఎన్నికల్లో అంతా బాగా పని చేశారని మనం గెలవబోతున్నామని ఇక నుంచే మన బాధ్యత ఇంకా పెరుగుతుందని మాజీ మంత్రి పరిటాల సునీత తమ పార్టీ నాయకులతో అన్నారు. మంగళవారం ఉదయం వ్యయసాయ క్షేత్రంలో నేతలతో సమావేశమయ్యారు. వెంకటాపురం గ్రామంలో రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అనంతపురం క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో, మహిళా నాయకురాళ్లతో మాట్లాడారు. గ్రామాల వారిగా పోలింగ్ ఎలా జరిగింది. ఎక్కడెక్కడ ఎంత ఓటింగ్ జరిగిందన్నది తెలుసుకున్నారు. అలాగే నాయకులు ఎక్కడెక్కడ బాగా పని చేశారు. ఏమైనా సమస్యలు ఎదురయ్యాయా వంటి అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కీలకమైన ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేసుకున్నామని ఇక నుంచి మన బాధ్యత మరింత పెరుగుతుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు.



వ్యవసాయ క్షేత్రంలో పరిటాల సునీత, టిడిపి నాయకులు

ధర్మవరంలో పోలీసు కవాతు



పట్టణంలో రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినందుకు ధర్మవరం పట్టణంలో మంగళవారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఎస్ఎఫ్ స్పెషల్ ఫోర్స్ పోలీసులు రూట్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపైన అన్ని సర్కిళ్లలో రూట్ మార్చ్ చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా ముగిసినందుకు ప్రజలు పోలీసులకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్నికల విధులలోనున్న బీఎస్ఎఫ్ స్పెషల్ ఫోర్స్ తమవంతు సహకారం అందించారన్నారు.

తాడిపత్రి రణరంగం

◆ టిడిపి, వైసిపి నాయకుల దాడి, ప్రతి దాడులు
◆ ఇరుగ్రూపుల మధ్య రాళ్ల వర్షం
◆ మూడు గంటల పాటు పట్టణంలో హైటెన్షన్
◆ పోలీసుల టియర్ గ్యాస్ ప్రయోగం
◆ సిఐకు గాయాలు
◆ ఒకరి పరిస్థితి విషమం



తాడిపత్రిలో రాళ్లు రువ్వుకుంటున్న టిడిపి, వైసిపి మద్దతుదారులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి నియోజకవర్గ కేంద్రం రణరంగాన్ని తలిపిస్తోంది. టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య పోలింగ్ సందర్భంగా నెలకొన్న చిచ్చు దారికి రావడం లేదు. సోమవారం నాడు పట్టణంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ప్రారంభం అయిన వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా పట్టణంలో ఈ రెండు పార్టీల మధ్య దారులు ఒకరిపై ఒకరు దాడులు, ప్రతిదాడులు చేసుకున్నారు. ఈ దాడులతో తాడిపత్రిలో భయానక వాతావరణం నెలకొంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ రోజంతా గడిపారు.

తాడిపత్రి పట్టణంలో వైసిపి కార్యకర్తలు పట్టణంలో ఉన్న టిడిపి నాయకుడు సూర్యముని ఇంటిపై మంగళవారం ఉదయం దాడి చేయడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో అక్కడే ఉన్న టిడిపి నాయకులు ప్రతిదాడిగా రాళ్ళు రువ్వారు. ఈ నేపథ్యంలో ఇరువు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు. టిడిపి, వైసిపి నాయకులు రాళ్లు రువ్వుకునే క్రమంలో అదుపు చేసేందుకు వెళ్లిన తాడిపత్రి పట్టణ సిఐ మురళీకష్ణ తలకు రాయి తగిలి గాయం అయ్యింది. వైసిపి నాయకులు సూర్యముని ఇంటిపై చేసిన దాడి విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి మద్దతుదారులతో కలిసి ఆందోళనకు దిగారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పెద్దారెడ్డి ఇంటి వద్దకు టిడిపి మద్దతుదారులు వెళ్తే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుందని గ్రహించిన పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ప్రత్యేక బలగాలను తాడిపత్రికి రప్పించారు. పోలీసులు ఎంత ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. అయినా టిడిపి మద్దతుదారులు ఏమాత్రం లెక్కచేయకుండా ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటి వైపు వెళ్లారు. ఈ సమయంలో మార్గమధ్యంలో వైసిపి నాయకులు కూడా వందలాదిమంది కార్యకర్తలతో ఎదురుగా వచ్చారు. పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో ఇరు గ్రూపులు మరోసారి ఒకరిపైఒకరు రాళ్లు రువ్వుకున్నారు. దాదాపు మూడు గంటలసేపు రాళ్లు విసురుకోవడంతో ఆ ప్రాంతంలో హైటెన్షన్ నెలకొంది. ఇందులో ఓ వైసిపి కార్యకర్తకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వైసిపి కార్యకర్తను ఆసుపత్రికి తరలించాగా పరిస్థితి విషమంగా అన్నట్లు వైద్యులు తెలిపారు. వైసిపి, టిడిపి మద్దతుదారులు దాడులు, ప్రతిదాడులను నిలువరించేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. ఎంత సేపటికీ గొడవలు సర్దుమనగక పోవడంతో పోలీసులు కేంద్ర బలగాల సహాయంతో లాఠీఛార్జీ చేశారు. రాత్రి 8 గంటల సమయంలో పరిస్థితి కాస్త అదుపులోకి వచ్చింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తాడిపత్రి ప్రజలు భయాందోళన మధ్య ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఎప్పుడు ఏ ఘటన చోటు చేసుకుంటోందన్న ఆందోళన తాడిపత్రి ప్రజల్లో కన్పిస్తోంది.



దాడిలో గాయపడిన సిఐ, కానిస్టేబుల్

నామమాత్రంగా పోలీసు చర్యలు

పట్టణంలో పోలింగ్ రోజున జరిగిన దాడికి ప్రతిదాడిగా మళ్లీ దాడులు జరుగుతాయన్న ఆలోచన పట్టణంలో నెలకొంది. పరిస్థితి ఇలా ఉన్నా పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మంగళవారం నాడు తాడిపత్రిలో ఇరువర్గాలు మరోసారి రాళ్ల దాడులకు పాల్పడే పరిస్థితి నెలకొంది. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి 144 సెక్షన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఇరు వర్గాలు రెచ్చిపోకుండా ఎప్పటికప్పుడు అరెస్టు చేసి చర్యలు చేపట్టాలని తాడిపత్రి పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

గాయపడ్డ వైసిపి కార్యకర్త పరిస్థితి విషమం

రాళ్లదాడుల్లో గాయపడిన కడప జిల్లా కొండాపురం మండలం కోడూరు గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి తలకు రాయి తగిలి తీవ్ర గాయం అయ్యింది. దీంతో హుటాహుటిన నాగేశ్వర్‌రెడ్డి స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు వైసిపి నాయకులు తెలిపారు.



కిలికెర వద్ద ప్రభుత్వ భూముల్లో చెట్లను నరకిన దృశ్యం

వాల్టా...ఉల్టా

కనుమరుగవుతున్న అటవీసంపద

చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు



చౌళూరు గ్రామం వద్ద మహా వృక్షాలను నరికి అనవాళ్లు లేకుండా కాల్చిన దృశ్యం

ప్రభుత్వ స్థలాల్లో ఏపుగా పెరిగిన చెట్లతో పాటు రైతులు పెంచుకున్న చెట్లు సైతం అక్రమార్కులు నరికి సొమ్ము చేసుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం లేదు. వృక్షసంపద రోజురోజుకు తరిగిపోతుంది. వన సంరక్షణ ధ్యేయంగా నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ఉపయోగించే ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. ప్రభుత్వ, అటవీ బీడు భూముల్లో మొక్కలు నాటినా, ఇందుకోసం ప్రభుత్వ ధనం కోట్ల రూపాయలు ఏటా వెచ్చించినప్పటికీ ప్రయోజనం శూన్యమే అవుతోంది. ప్రకతిని, వృక్ష సంపదను కాపాడటానికి ప్రభుత్వం తీసుకొచ్చిన వాల్టా చట్టం అటవీ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఉల్టా అవుతోంది. అక్రమంగా కలపను రవాణా చేయడాన్ని అదుపు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే అటవీశాఖ అధికారులు మాత్రం స్మగ్లర్ల ఆటను మరింత ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. చెట్లను యథేచ్ఛగా నరికి రవాణా చేయడాన్ని కట్టడి చేయడానికి ప్రభుత్వం చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. కానీ ప్రభుత్వం ఉదేశ్యం నీరుగారిపోతుంది. చెక్‌పోస్టుల దాటి అక్రమంగా కలప రవాణా జరుగుతూనే ఉంది. అయినా పట్టించుకునే నాథుడే లేడు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలతో పాటు లేపాక్షిలో ఉన్న పరిశ్రమ నిర్వహకులు యధేచ్ఛగా పరిశ్రమల్లో ఉన్నా బాయిలర్లకు అక్రమ కలపను ఉపయోగిస్తున్నారు. ఈ విషయం తెలిసినప్పటికి వారి నుంచి అటవీశాఖ అధికారులు మామూళ్లు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారే తప్ప వారిపై కనీస చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినపిస్తున్నాయి. అన్ని ఆధారాలతో అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికి చర్యలు తీసుకోవడం పక్కన పెడితే, ఏ ఒక్కరికి కనీసం నోటీసులు సైతం ఇవ్వడం లేదు. మరి కొంత మంది ప్రభుత్వ భూముల్లో ఉన్న ప్రకృతి సంపదను అడ్డంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. నాడు అక్బర్ చక్రవర్తి చెట్లను పెంచి పకృతిని పెంచితే...హిందూపురం ప్రాంతంలో అటవీశాఖలో పని చేస్తున్న అదేపేరున్న ఓ అధికారి చెట్లను దగ్గరుండి నరికి సొమ్ము చేసుకుంటున్నారని పర్యావరణ వేత్తలు ఆరోపిస్తున్నారు. ఇతనిపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులపై ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. చివరికి ఈ అవినీతి అధికారిపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి సైతం పర్యావరణ వేత్తలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికి ప్రభుత్వంలో కనీస చలనం కనిపించడం లేదు. కలపను ఇక్కడి నుంచి పావగడకు ఎగుమతి చేసుకుని అక్కడి నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా సబందిత అధికారులు పత్యేక దృష్టి సారించి చెట్లను సంరక్షించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

నేలకూలుతున్న భారీవృక్షాలు

అక్రమార్కుల స్వార్థానికి భారీవృక్షాలు నేలకూలుతున్నాయి. శతాబ్దాల కాలం నాటి అతి పెద్ద చెట్లను సైతం అక్రమార్కులు నరికివేసి దుంగలను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇది గమనించిన కొందరు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా వారు ఆలస్యంగా వచ్చి చెట్లను లెక్కించి ట్రాక్టర్ లోడుకు రూ.7,500లు కట్టించుకుని రసీదు ఇచ్చి విడిచిపెడుతున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. వాస్తవానికి ఒక టన్నుకు రూ.17వేలు జరిమానా వేసి ట్రాక్టర్ సీజ్ చేయాల్సి ఉంది. దీనిని జిల్లా అటవీ శాఖ అధికారి పరిశీలన చేసి దీనికి అదనంగా జరిమానా వేయాల్సి ఉంది. అయితే తూతూ మంత్రంగా జరిమానా వేసి వెంటనే ట్రాక్టర్లను పంపుతున్నారు. ఇలా కలపను అక్రమంగా తరలిస్తున్న ప్రతిసారి అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో అక్రమార్కులు రెచ్చిపోతూ దొరికినంత దోచుకుంటున్నారు.

చెట్లకు రక్షణ ఏదీ..?

భారీగా చెట్లను నరికి వేయడం వలన చెట్ల పరిరక్షణ కరువైంది. దీని వలన పచ్చదనం, ప్రాణవాయువు తగ్గిపోతోంది. కాలుష్యం పెరిగి వాతావరణ సమతుల్యం దెబ్బతింటోంది. లేపాక్షి, చిలమత్తూరు, మడకశిర, సోమందేపల్లి తదితర ప్రాంతాలలో అటవీ ప్రాంతం ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉంది. చెట్లను విపరీతంగా నరికి తరలించడం వలన అడవుల విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో ఇక్కడ ఉంటున్న అడవి జంతువులు పల్లెలు, పట్టణాల్లోకి వచ్చే ప్రమాదం ఉంది.ప్రస్తుత కాలంలోనే అడవి జంతువులు ప్రధాన రహదారులు, గ్రామాలు, పట్టణాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కాస్తా కూస్తో అటవీ విస్తీర్ణం ఉండగానే జంతువుల ఇలా వస్తుంటే ఇక అడవులను పూర్తిగా నిర్వీర్యం అయితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో మరి.

అటవీ శాఖలో అక్రమాలు

చట్టాల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని కొంతమంది స్వార్థ పూరిత అటవీశాఖ అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తూ జేబులు నింపుకునే పనిలో పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. కలప అక్రమ రవాణాను తమ అదాయ వనరుగా మల్చుకుని దొరికినంత దోచుకుంటున్నారు. ఇక చెక్‌పోస్టులు ఉన్నా అవి నామమాత్రమే. ప్రధానంగా చింత, వేప కానుక, మద్ది, వివిధ రకాల నీడనిచ్చే భారీ చెట్లను, ఫలాలు అందించే చింత కానుగ, వేప చెట్లను తెగనరికి తరలించేస్తున్నారు. కాలుష్యాన్ని తగ్గించే చెట్లను నరికించి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న వారికి ఫారెస్టు అధికారులు మొక్కుబడిగానే జరిమానాలు విధించి వారిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అటవి, రెవిన్యూ శాఖల చేతిలో వాల్టా ఉల్టా

పరిశ్రమలు, టింబర్స్ సామిల్లు, ఇటీక బట్టీల వారు చెట్ల దుంగలు, శతాబ్దాల కాలం నాటి చెట్లను తెగనరికి నిర్భయంగా ప్రధాన రహదారుల గుండా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా చెక్‌పోస్టుల వద్ద అధికారులు, అటవీశాఖ, రెవెన్యూ అధికారులు నిద్రావస్థలో ఉన్నారన్న ఆరోపణలు పట్టణ ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

స్పందించని ఉన్నత అధికారులు

హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల వ్యాప్తంగా ఫలాలు ఇచ్చే చెట్లతో పాటు నీడనిచ్చే చెట్లు, వలస పక్షులు బస చేసే ప్రాంతాల్లో ఉన్నా వందలాది చెట్లను సైతం అక్రమార్కులు తెగనరికి అక్రమంగా తరలిస్తున్నప్పటికి ఉన్నతాధికారుల్లో కనీస స్పందన లేదు. ఆయా ప్రాంతాల్లో ఉన్న చెక్‌పోస్టులు ఉన్నప్పటికి నామ మాత్రంగానే తనఖీలు చేస్తున్నారు. అక్రమంగా కలపను రవాణా చేస్తున్నా, అడవులు హరిస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహించడం దారుణం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్రమత్తును వీడి వృక్ష సంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలుతున్న కలప

కురుబ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన కురుబ కుల బాంధవుల యొక్క పిల్లలకు ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలను ఇవ్వనున్నట్లు కురుబ సంక్షేమ సంఘం, కురుబ కళ్యాణ మండప కమిటీ, కురుబ యువజన ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. పట్టణ, మండల పరిధిలోగల కురుబ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు పదవ తరగతిలో 500 మార్కులకు పైగా మార్కులకు పొందిన వారు, ఇంటర్మీడియట్ పరీక్షలో 900 పైగా మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఈనెల 22వ తేదీ లోపు కురుబ కళ్యాణమండపంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.. క్యాస్ట్ సర్టిఫికెట్, మార్కుల జాబితాను దరఖాస్తుకు జతచేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440808732, 9908387330, 9393888939, 94900895232 సెల్‌నంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గుత్తి ఉపకారాగారం తనిఖీ

గుత్తి : పట్టణంలోని ప్రత్యేక ఉపకారాగారాన్ని మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో ఉన్న నిత్యావసర వస్తువులను తనిఖీ చేసి జైలులో సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు, కోర్టు టైపిస్ట్ సాదిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

ఎపిఆర్‌డిసిలో ఓడిచెరువు విద్యార్థి ప్రతిభ

ఓబుళదేరవచెరువు : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024లో ఓబుళదేవరచెరువు మండల విద్యార్థి ప్రతిభ కనపర్చారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో మండలంలోని తుమ్మలకుంట్లపల్లి పంచాయతీ ఎగువ చెర్లోపల్లి గ్రామానికి చెందిన యరమనేని రామకృష్ణ, ఇందిరమ్మ దంపతుల కుమారుడు యశ్వంత్ నాయుడు 66వ రాంక్ తో 76 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. విద్యార్థి యశ్వంత్ నాయుడు అమడగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సిఈసి గ్రూపులో 875 మార్కులు సాధించి కళాశాలలో ద్వితీయ స్థానంలో నిలిచాడు.

ఆలయంలో అన్నదానం

అనంతపురం : పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో సోములదొడ్డి పంచాయతీలోని నవయుగ కాలనీలో ఉన్న పెద్దమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణగావించారు. నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు మేఘనశ్రీ, బాలాజీ పెళ్లిరోజును పురస్కరించుకుని అన్న సంతర్పణ కార్యక్రమానికి సహకరించినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి తెలిపారు.

క్రీడల ప్రోత్సాహానికి జిల్లా లీగ్‌లు కీలకం

ఆర్డీటీ డైరెక్టర్, ఎపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ మాంఛోఫెర్రర్

అనంతపురం క్రికెట్ లీగ్ ప్రారంభం



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం:క్రీడాకారులను ప్రోత్సహించడానికి జిల్లా లీగ్‌లు చాలా కీలకమని ఆర్డీటీ డైరెక్టర్, ఎపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ మంచోఫెర్రర్ అన్నారు. అనంతపురం క్రికెట్ లీగ్ సీజన్-2 ప్రారంభం సందర్భంగా అనంత క్రీడాగ్రామంలోని బి.గ్రౌండ్‌లో ఫ్యామిలీ క్లబ్ వర్సెస్ ఇండియన్ సిక్సర్స్ మ్యాచ్‌ను మాంచోఫెర్రర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌తో ప్రారంభమై ఫుట్‌బాల్, హాకీ, టెన్నిస్, ఆర్చరీ, కబడ్డీ, జూడో తదితర క్రీడలను విస్తరింపజేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిఎ అధ్యక్షులు పిఎల్ ప్రకాష్‌రెడ్డి, సెక్రటరీ, కె.మధుఆచారి, ఆర్డీటీ డైరెక్టర్ పి.సాయికృష్ణ, ఎడిసిఎ జాయింట్ సెక్రటరీ భీమలింగారెడ్డి, ట్రెజరర్ షబ్బీర్‌అహ్మద్, బిసిసిఐ లెవల్-2 కోచ్ ఎం.శ్రీవాస్‌రెడ్డి, రంజీ ట్రోఫీ మాజీ ప్లేయర్ కెఎస్ షహబుద్దీన్, అనంతపురం. మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కె.భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి టివి చంద్రమోహన్‌రెడ్డి, టీమ్ స్పాన్సర్లు డాక్టర్ సుప్రజ, హరీష్‌యాదవ్, శ్రీనివాసులు, రామాంజి, కోచ్‌లు పి.మహేశ్వర్, ఆర్.కుమార్, ఆర్.ప్రవీణ్, షోయబ్, శంకర్ ధావన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'అమ్మ' అండ

ప్రజాశక్తి-అనంతపురం

బుక్కరాయసముద్రం మండలం జంతులూరులో నివాసం ఉంటున్న బాధిత కుటుంబానికి అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. జంతులూరు గ్రామంలో నివసిస్తున్న హరిజన బళ్లారి రవికుమార్, భార్య లక్ష్మీదేవికి ముగ్గురు ఆడపిల్లలు. ఇందులో మొదటి ఇద్దరూ మానసిక వికలాంగులు. 3వ పాప 6వ తరగతి చదువుతోంది. ఈనేపథ్యంలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్న రవికుమార్‌కు రెండేళ్ల క్రితం జరిగిన బైకు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతింది. దీంతో ఇంటికే పరిమితమయ్యాడు.



ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి

ఈనేపథ్యంలో కుటుంబ పోషణ భారమైంది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి గ్రామానికి వెళ్లి రూ.50వేల విలువజేసే అవసరమైన వంట సామగ్రి, పిల్లలకు దుస్తులు, వైద్య ఖర్చులకు రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే చిన్న అమ్మాయి చదువుకు అయ్యే ఖర్చు అమ్మసంస్థ భరిస్తుందని హామీ ఇచ్చారు. అంతేగాకుండా ప్రస్తుతం గుడిసె ఉండటంతో వచ్చే నెలలో ఇల్లు కట్టించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సహాయం అందించిన అమ్మసంస్థ వ్యవస్థాపకులు రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యథేచ్ఛగా మట్టితరలింపు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండల కేంద్రంలోని నడింబోటు వద్ద మట్టి తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జెసిబితో అక్రమంగా మట్టిని తరలిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. మట్టిమాఫియా పెట్రేగిపోతోంది. ఒక ట్రాక్టర్ మట్టి తీసుకెళ్లాలంటే వెయ్యి రూపాయలు చెల్లించాలి. ఇలా మట్టి మాఫియా దారులు వారి లాభాల కోసం కొండలు గుట్టలను జెసిబితో కరిగిస్తున్నారు. పర్యావరణ కాపాడాల్సిన అధికారులు కొండలు గుట్టల రక్షించకుండా మట్టి తరలింపుదారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి తరలింపును అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి సంయుక్తంగా కృషి చేద్దామని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. మంగళవారం స్థానిక అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ఎంతో ఉత్తమం అన్నారు. దీనివల్ల ఎలాంటి వ్యయప్రాయాసాలకు గురికావాల్సిన అవసరం ఉండదన్నారు. వివాహ సంబంధ కేసులు భరణం చెల్లింపు కేసులు పిల్లలను అప్పగించడం వంటి కేసులు, ఇళ్ల వద్ద జరిగే చిన్నపాటి తగాదాల కేసులు, ఉద్యోగులు, సంస్థల మధ్య నమోదైన కేసులు తదితర కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. వాది, ప్రతివాదులు మధ్యవర్తిత్వానికి సంబంధించి లిఖితపూర్వకంగా తెలియజేస్తే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మధ్యవర్తిత్వంపై చర్చలు జరపడం జరుగుతుందన్నారు. ఆయా బాధితులతో కలిపి, వేరువేరుగా, న్యాయమూర్తుల సమక్షంలో చర్చలు, అవగాహన కల్పించిన అనంతరం కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. వాది, ప్రతివాదుల పూర్తి సమ్మతం మేరకు కేసును పరిష్కరించి డిగ్రీ మంజూరు చేయడం జరుగుతుందని ఏడిజే తెలిపారు. న్యాయవాదులు తమ పరిధిలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోగలిగే కేసులను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాదులు హిదయతుల్లాఖాన్, శ్రీరాములు, కళావతి పార్వతి, సుధాకర్, సుకుమార్, రకీబ్, వెంకటేష్, సందీప్‌తోపాటు లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కంపల్లె శైలజ

నేరాలు ఘోరాలు

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో రెండు కుటుంబాల మధ్య సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘర్షణలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు... ఎనుములపల్లి దొమ్మర గుడిసెల కాలనీలో నివాసం ఉంటున్న రెండు కుటుంబాల మధ్య సోమవారం రాత్రి వివాదం చెలరేగింది. దీంతో ఇరువర్గాలు దాడి చేసుకోవడానికి ప్రయత్నం చేయగా సమీప బంధువైన ఎరికల గురుమూర్తి (55) అక్కడికి చేరుకొని ఘర్షణను నివారించే ప్రయత్నం చేశాడు. ఈ దాడిలో ఆయనకు తలకు బలమైన గాయం తగిలింది. దీంతో గురుమూర్తిని చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స గురుమూర్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికల్లో పలుచోట్ల ఘర్షణలు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికలలో పలు గ్రామాలలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నియోజకవర్గంలో పుట్టపర్తి మున్సిపాలిటీలో గల బ్రాహ్మణపల్లిలో వైసిపి, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దొంగ ఓట్లు పోల్ అవుతున్నాయని తెలిసి టిడిపి వర్గాలు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగాఇ టిడిపి, వైసిపి నాయకులు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో పలువురు వ్యక్తులు గాయపడ్డారు. అలాగే నల్లమాడ మండలంలో నల్ల జంగయ్య గారి పల్లి లో వైసిపి నాయకులు రిగ్గింగ్ కు పాల్పడుతున్నారని అక్కడ ఉన్న నాయకులు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అలాగే ఒడిసి మండలంలో కుసుమ వారి పల్లి లో ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగి ఘర్షణ చోటుచేసుకుంది. అందులో టిడిపి కార్యకర్తకు బలమైన గాయాలు తగలడంతో కదిరి ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా డబూరు వారి పల్లి పోలింగ్ కేంద్రంలో ఇరువర్గాల నాయకులు దాడులు చేసుకున్నారు. ఈ ఎన్నికల ఘర్షణలు నివారించడంలో పోలీసులు విఫలమయ్యారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ట్రాక్టర్ బోల్తా.. కూలీ మృతి

వజ్రకరూరు : ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన ఘటన వజ్రకరూరు మండల కేంద్రం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు నుంచి బండల లోడ్‌తో వజ్రకరూరుకు వస్తుండగా ట్రాక్టర్ ఇంజన్ పెద్ద టైర్ ఫంచర్ కావడంతో వజ్రకరూరు వద్ద బోల్తా పడింది. దీంతో కూలి పని చేసుకున్న సూరి బండల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు కూలీలు హొన్నూరుస్వామి, మల్లికార్జునకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని శ్రీపురం గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గుంతకల్లు నుంచి గుత్తికి వస్తున్న ఆటో శ్రీపురం గ్రామం వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన లోలోనాయక్, గుత్తి మండలం తురకపల్లి గ్రామానికి చెందిన సుంకన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు కారులో వెళ్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు క్షతగాత్రులను వాహనంలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని తర్వాత చేపట్టారు.

సిఐకి గాయాలు

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున రాయదుర్గం సీఐ వాహనం ప్రమాదానికి గురైంది. ఎన్నికల విధులు పూర్తి చేసుకుని కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గం వెళ్తుండగా గుర్తు తెలియని లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనం బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న రాయదుర్గం రూరల్ సీఐ శ్రీనివాసులు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేక వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయ కేబుల్ వైర్ ధ్వంసం

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామానికి టిడిపి నాయకుడు నరేష్‌నాయుడుకు చెందిన తోటలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ కేబుల్ వైర్‌ను ధ్వంసం చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయాన్నే తోటకు వెళ్లి చూడగా కేబుల్ వైర్‌ను రాయితో ముక్కలు ముక్కలు చేసినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.